ప్రజాశక్తి

శనివారం 19 జులై 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



పేషెంట్లకు విసనకర్ర, తువ్వాళ్లతో విసురుతున్న కుటుంబసభ్యులు

కరెంట్ పోతే..ఉక్కపోతే.!

- మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇదీ సంగతి..
- జనరేటర్ ఉన్నా.. వినియోగం సున్నా..
- విసన కర్రలకు, తువ్వాళ్లకు పని చెబుతున్న రోగులు..

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. కనీసం కరెంటు పోయిన సమయంలో కూడా జనరేటర్ సౌకర్యాన్ని వినియోగించకపోవడంతో రోగులకు ఉక్కపోతకు గురవ్వాల్సిందే.!

మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అవసరమైన మందులు, అవసరమైన వైద్యుల కొరత బాగా ఉంది. సరైన వైద్యం ఎలాగూ లేదు.. కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ కొరత లేకుండా చర్యలు తీసుకోవడంలో ఇక్కడి అధికారులు విఫలమవుతున్నారు. కరెంటు లేని సమయంలో గంటల తరబడి ఉక్కపోతకు గురికాక తప్పడం లేదు. చిన్నారులు గాలి ఆడక గుక్కపెట్టి ఏడుస్తున్నారు. ఓ చిన్న ఊరికి అవసరమైన కరెంటు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన జనరేటర్ సౌకర్యం వైద్యశాలకు అందుబాటులో ఉంచారు. అత్యవసర సమయాల్లో కూడా జనరేటర్ వినియోగించడం లేదు. ఇదేమంటే గంటకు పాతిక లీటర్ల డీజిల్ ఖర్చవుతుందనే సాకుతో జనరేటర్ అలంకారప్రాయంగా మిగిలిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయేది అరుదుగా ఉంటుంది. గాలి వాన సమయంలో అప్పుడప్పుడూ సరఫరా నిలిచిపోతోంది. ఆ కొద్ది సమయాల్లో కూడా ▶ 2లో

జిల్లాకు పెట్టుబడులేవీ.?



- పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో అభివృద్ధి జిల్లాల్లోనే ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఆమోదం
- జిల్లాలో ఏ సంస్థా పెట్టుబడి పెట్టేందుకు అవకాశం లేదా?
- ఎండమావులుగానే కనిగిరి, దొనకొండ పరిశ్రమల కేంద్రాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం గురువారం నాడు సిఎం క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక ఒప్పందాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో రూ.39,509 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఐటి ఫుడ్ ప్రాసెసింగు, ఇంధన, పర్యాటక రంగాలకు సంబంధించి 22 సంస్థలు ఆసక్తి చూపాయి. తద్వారా 30,899 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థల ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. పలు జిల్లాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించాయి. వాటికి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది. ఈ పెట్టుబడులు పెట్టేవన్నీ బాగా అభివృద్ధి చెందిన జిల్లాల్లోనే ఉన్నాయి. ఒక్క సంస్థ కూడా పెట్టుబడులను పెట్టేందుకు జిల్లాను ఎంచుకోలేదు. చివరికి వెనుకబడిన శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాలను కూడా కొన్ని సంస్థలు ఎంచుకున్నాయి. ప్రకాశం జిల్లాలో ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టేందుకు ఏ సంస్థా రాలేదు.

మండలి సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల జిల్లాకు చెందిన మరో మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా పాల్గొన్నారు. ఈ రెండు జిల్లాల్లో పెట్టుబడులు మాత్రం కనిపించలేదు. దీని వల్ల జిల్లాలో అనేక సహజవనరులున్నా ఉపయోగం లేకుండా పోతోంది. అటు ప్రభుత్వ రంగంలోనూ పెట్టుబడులు లేవు. కొన్ని సంస్థల ద్వారా ఇప్పుడు పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నారు. వారికి కావాల్సిన భూములను ఇస్తున్నారు. ఆ జాబితాలోనూ జిల్లాలో అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించడం లేదు. పెట్టుబడులకు ప్రోత్సాహం లేకనా? అవకాశాలు లేకనా? అనేదీ స్పష్టత లేదు. జిల్లాలో గతంలోనే వాన్‌పిక్ సంస్థకు 25 వేల ఎకరాలు అప్పగించారు. తీరప్రాంతంలోని భూములన్నింటికీ అప్పట్లో బలవంతంగానే సేకరించి ఇచ్చారు. వాటిల్లోనే పరిశ్రమలతో పాటు ఓడరేవులు, విమానాశ్రయాలు ప్రతిపాదించారు. నిజాంపట్నం నుంచీ ఓడరేవు మీదుగా కొత్తపట్నం మండలం వరకూ పలు పరిశ్రమలు పెట్టాలని ఈ ప్రాజెక్టులో భావించారు. అయితే ఈ భూములన్నీ ఇప్పుడు ఈడీ పరిధిలోకి వెళ్లాయి. జగన్ అక్రమాస్తుల కేసుల్లో వాన్‌పిక్ సంస్థ యజమానులు ఉన్నారు. దీంతో ఈ భూముల కథ కంచికి చేరింది. ఇప్పటికీ నిరుపయోగంగానే పెట్టారు. ఇక కనిగిరి, దొనకొండ వద్ద పరిశ్రమల కేంద్రాలు తెరపైకి వచ్చాయి. కనిగిరి సెజ్ కేంద్రంలో యుపిఏ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రకటించారు. అప్పట్లో కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న ఉగ్రనరసింహారెడ్డి దీని కోసం ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు ప్రాజెక్టును ప్రకటించారు. పామూరు, పీసీపల్లి మండలాల్లో 20 వేల ఎకరాలు భూమిని సేకరించి ఇక్కడ పరిశ్రమలు పెట్టాలని ప్రతిపాదించారు. రామాయపట్నం పోర్టుతోనూ దీన్ని అనుసంధానం చేయాలని ▶ 2లో

ప్లాస్టిక్ నిషేధం సాధ్యమేనా.?



- ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్ల కోసం కసరత్తు
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు ప్రకటించిన కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకట మురళి ప్రకటించిన విషయం తెలిసిందే.. ఈ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు విస్తృత ప్రణాళికలు రూపొందిస్తునట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, క్యారీ బ్యాగులు, స్ట్రాలు వంటి వాటిపై పూర్తి నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను అమ్మినా, కొన్నా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నిషేధం జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 25 మండలాల్లో పటిష్టంగా అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

దేశంలో ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ని (సింగిల్ యూజ్ ప్లాస్టిక్) ప్రభుత్వం నాలుగేళ్ల క్రితమే నిషేధించింది. 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, అమ్మకం, వినియోగాన్ని 2021 సెప్టెంబర్ 30 నుండి నిషేధిస్తున్నట్లు, 120 మైక్రాన్ల మందం కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ని డిసెంబర్ 31, 2022 డిసెంబర్ 31 నుండి నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం గతంలోనే ప్రకటించడం జరిగింది. అప్పట్లో దుకాణాలపై దాడులు చేసి క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ కప్పులను అరకొరగా స్వాధీనం చేసుకోవడం, జరిమానాలు విధించడం చేశారు. అంతే తప్ప సీరియస్‌గా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ మనుగడలో లేకుండా చేయడం గానీ, దీనికి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జూట్ బ్యాగులను అందుబాటులోకి తెచ్చే చర్యలు లేకుండా పోయాయి. ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో ఉంటేనే కదా వాడకం అనేది జరిగేది. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల ఉత్పత్తి లేకుండా చెయ్యాలి. కానీ పైస్థాయిలో తయారు చేసుకోవడానికి లైసెన్స్‌లు ఇచ్చేసి.. షాపులలో అమ్ముకోవడానికి పర్మిషన్‌లు ఇచ్చేసి వినియోగదారుడిని వాడకూడదు అని చెప్పడం పరిపాటి అయ్యింది. అసలు ఉత్పత్తి లేకుండా చేస్తే సరిపోతుంది.. కానీ పారిశ్రామికవేత్తల నుంచి వచ్చే ఒత్తిడి వల్ల ప్రభుత్వం అలా చెయ్యదు. పన్నుల ద్వారా వచ్చే రాబడికి నష్టం కనుక.. అందువల్ల ఏ ప్రభుత్వం కూడా పర్యావరణానికి హానికరంగా ఉండే ప్లాస్టిక్‌ని ఉత్పత్తి దశలోనే నిలిపివేయడం చెయ్యకుండా ప్లాస్టిక్ వాడకూడదు అని మాత్రమే చెబుతూ వాటిని అమ్మే చిన్న బడ్డీ కొట్లు, దుకాణాల వారిపై జరిమానాలు వేయడం చేస్తూ.. వస్తున్నారు. థర్మాకోల్, ఫ్లెక్సీల కారణంగా కూడా పర్యావరణానికి హాని జరుగుతుంది. గతంలో ఈ ఫ్లెక్సీల నిషేధం కూడా తెచ్చారు గానీ అమలుకు నోచుకోలేదు. పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడం అంత సులభం కాదు. ఇందుకు విస్తృతంగా ప్రజల్లో అవగాహన తేవాలి. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే ముప్పు గురించి తెలియజెప్పాలి. ప్రజలందరూ చేతిసంచితో మార్కెట్‌కి వెళ్ళేలా అవగాహన తేవాలి. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు వాటిని సేకరించి రీసైకిల్ చేసే చర్యలు స్థానిక సంస్థల్లో చేపట్టాలి. ప్లాస్టిక్ రహిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించడానికి గుడ్డ సంచులు, పేపరు బ్యాగులు, జనపనారతో రూపొందించిన సంచులను తక్కువ ధరలో అందుబాటులోకి తేవాలి.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

2027లో ముందస్తు ఎన్నికలు

వైసిపి విస్తృత సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి

▲ 5లో



సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో తొక్కిస్తున్న ఎస్పీ దామోదర్

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు

▲ 8లో

జిల్లాకు పెట్టుబడులేవీ.?

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించారు. అనేక రకాలుగా ఆలోచనలు తప్ప ఆచరణలోఏమీ లేవు. ఇటీవల రిలయన్స్ సంస్థ బయోఇంధన ప్రాజెక్టు పెట్టేందుకు సిద్ధమవ్వగా పీసీపల్లి మండలంలో భూములు ఇచ్చారు. మంత్రి లోకేష్ కూడా దీనికి శంకుస్థాపన చేశారు. దీని పనులు ఇంకా మొదలు కాలేదు. ఈ ప్రాజెక్టు పనులు మొదలైతే కనిగిరి సెజ్‌కు కొంత కొత్త రూపు వస్తుందేమో చూడాలి. పీసీపల్లి మండలంలో మాలకొండ సమీపంలో ప్రభుత్వ భూముల్లో వేసిన ప్లాట్లు కూడా పరిశ్రమలు లేక ఖాళీగానే ఉన్నాయి. ఇక్కడ పలు సంస్థలకు భూములు ఇచ్చి పరిశ్రమలు పెట్టించేందుకు అవకాశాలున్నాయి. ఆ దిశగా మండలిలో చర్చ సాగాలి. ప్రభుత్వం నుంచి కూడా ప్రతిపాదనలుండాలి. ఇక దొనకొండ వద్ద పరిశ్రమల కేంద్రంపై సాగుతున్న చర్చలు తెలిసినవే.. ఇక్కడ గతంలో అంటే 2014-19 మధ్య పరిశ్రమల కేంద్రం తెరపైకి వచ్చింది. రాష్ట్రం చీలాక వివిధ జిల్లాల్లో చేపట్టే ప్రాజెక్టుల్లో భాగంగా దీన్ని ప్రకటించారు. అయితే ఇది పదేళ్లుగా ఊరిస్తూనే ఉంది. ఒక్క పరిశ్రమ రాలేదు. ప్రభుత్వ భూములతో పాటు కొంత ప్రైవేటు భూమిని పరిశ్రమల కేంద్రానికి కేటాయించే ప్రతిపాదనలు నడిచాయి. ఇప్పటికే కొంత భూమి సేకరించి ఏపిఐఐసీ ప్లాట్లు వేసింది. అయితే ఏ ఒక్క పరిశ్రమా రాలేదు. ఒక్కరికీ ఉపాధి కలగలేదు. ఇక్కడ ఏఏ తరహా పరిశ్రమలు పెట్టడానికి అవకాశం ఉందో పరిశీలించి కొన్ని సంస్థలతో సంప్రదింపులు జరపాలి. పరిశ్రమలు పెట్టేలా ప్రోత్సాహం ఇవ్వాలి. ఆ దిశగా చర్యలు లేవు. వీటిని నమ్ముకొని భూములను, అమ్మడం కొనడం వంటివి జరిగాయి. కొందరు బడాబాబులు అప్పట్లో హడావుడిగా రియల్ఎస్టేట్‌పై పెట్టుబడులు పెట్టి చేతులు కాల్చుకున్నారు. సేకరించిన భూముల్లో ఏ పరిశ్రమలూ లేవు. అన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఇప్పటికైనా చిత్తశుద్ధితో కనీసం కనిగిరి, దొనకొండ వద్ద ప్రతిపాదనల్లో ఉన్న పరిశ్రమ కేంద్రాలనైనా అభివృద్ధి చేస్తే అనుకున్నట్లు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

కరెంట్ పోతే..ఉక్కపోతే.!

(మొదటిపేజీ తరువాయి)

జనరేటర్ వినియోగించకపోతే ఎలా అని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ విధంగా చెప్పాలంటే జనరేటర్ ఉన్నా... వినియోగం సున్నా! డీజిల్ ఖర్చు మాత్రం బిల్లుల రూపంలో బోలెడుగా చూపడం విడ్డూరమే.!

మార్కాపురం పట్టణంలో గురువారం రాత్రి ఓ మాదిరి వర్షం కురిసింది. వైద్యశాల ప్రాంగణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. తెల్లవారుజామున 4 గంటల నుండి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా వైద్యశాల పూర్తిగా నిలిచిపోయింది. సుమారు 11 గంటల పాటు ఏకధాటిగా విద్యుత్ లేక రోగులు అల్లాడిపోయారు. ఇలాంటి అత్యవసర సమయాల్లో వినియోగించుకునేందుకు ఓ ఊరికి సరిపడేంత సామర్థ్యం కలిగిన జనరేటర్ అందుబాటులో ఉంది. జనరేటర్ కూడా ఆడించకపోవడంతో రోగులు, చిన్నారులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. పుట్టిన చిన్నారులు, బాలింతల పరిస్థితి వర్ణనాతీతం. ఫ్యాన్‌లు తిరగకపోవడంతో గాలి కోసం విసనకర్రలు, తువాళ్లకు పనిచెప్పారు. విద్యుత్ సరఫరా లేదనే సాకుతో కొన్ని విభాగాల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. వైద్యశాల నిర్వహణపై అక్కడకు వైద్యం కోసం వచ్చిన రోగులు అసహనంతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.



పేరుకుపోతున్న చెత్త

కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడే..

సమస్యల పరిష్కారానికి చొరవేదీ? • అపరిశుభ్రంగా గిద్దలూరు

ప్రజాశక్తి-గిద్దలూరు

గత 6 రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఏం చేసుకుంటారో చేస్కోండి అన్న చందంగా తయారయ్యింది. స్పందించేది లేదంటూ భీష్మించుకుని కూర్చుంటోంది. పట్టణంలో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోతూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతూనే ఉంది. దోమలు విజృంభిస్తూనే ఉన్నాయి. కంపు భరించలేం అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అయినా సర్కారు మాత్రం దిగిరావడంలేదు. ఎవరేమైతే మాకేంటి అనే ధోరణిలో ఉంది. పారిశుధ్య కార్మికుల సమ్మెతో పట్టణంలోని రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తా చెదారం కనిపిస్తూ ఉంది. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విజంభించి రోగాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు సాధించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మెకు దిగడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయింది. క్లాప్ వాహనాలు కూడా నిలిపివేయడంతో చెత్త సేకరణ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు కూడా తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపైకి తెచ్చి పడేయడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి కార్మికులతో చర్చించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సర్పంచ్ సుబ్బారెడ్డి మృతి



ప్రజాశక్తి-మార్కాపురం

మండలంలోని కోలభీమునిపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్టిరెడ్డి సుబ్బారెడ్డి(65) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన వైసిపిలో కొనసాగుతున్నారు. ఆయనకు భార్య పేరమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యేలు కెపి కొండారెడ్డి, జంకె వెంకటరెడ్డి, కుందరు నాగార్జునరెడ్డి, ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, జడ్పిటిసి నారు బాపన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చెంచిరెడ్డి, వైసిపి నాయకులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది సుబ్బారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి-పెద్దారవీడు: యర్రగొండపాలెంలో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పెద్దారవీడు మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి శుక్రవారం కోరారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

వివరాలు వెల్లడించిన సిఐ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని నల్లగుంట్లలో జరిగిన ఓ వ్యక్తి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు యర్రగొండపాలెం సిఐ సిహెచ్. ప్రభాకరరావు, ఎస్ఐ మహేష్ తెలిపారు. పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు వివరాలు తెలిపారు. నల్లగుంట్లకు గ్రామానికి చెందిన బైరబోయిన వెంకటేశ్వర్లు పాత కక్షల నేపథ్యంలో కొంతమందితో కలిసి అదే గ్రామానికి చెందిన మొద్దు వెంకటేశ్వర్లును 2022 ఫిబ్రవరి 9న హత్య చేసినట్లు తెలిపారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న వెంకటేశ్వర్లు బంధువులు బైరబోయిన వెంకటేశ్వర్లును చంపాలని ముందుగానే ఓ పథకం వేసుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 4న రాత్రి 11 గంటల సమయంలో పీర్ల ఊరేగింపు సమయంలో వెంకటేశ్వర్లుపై కత్తులతో దాడి చేసి హతమార్చినట్లు తెలిపారు. బైరబోయిన విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మార్కాపురం డిఎస్‌పి నాగరాజు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఈ నెల 17న కొర్రపోలు గ్రామంలోని నల్లగుంట్ల అడ్డ రోడ్డు వద్ద, మొద్దు తిరుపతిరావు, బైరబోయిన బాల తిరుమలయ్య, మొద్దు వెంకటేశ్వర్లు, మొద్దు రాము కుమార్., ఓ బాలుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయటంలో ప్రతిభ చూపిన మార్కాపురం డిఎస్‌పి నాగరాజు, యర్రగొండపాలెం సిఐ ప్రభాకర్, దోర్నాల ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది బాజీబాబు, నాగశ్రీను, శ్రీను, మోహన్‌ను ఎస్‌పి దామోదర్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ ప్రభాకరరావు

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి -వెలిగండ్ల


పోకూరి శివ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... మొగుళ్ళూరు గ్రామానికి చెందిన పోకూరి శివ(25) అనే యువకుడు బేల్దారి పనుల నిమ్మిత్తం చెన్నై వెళ్లాడు. రోజులాగే పనులు నిర్వహిస్తున్న క్రమంలో క్రింది అంతస్తు నుంచి రెండో అంతస్తుకు ఇనుప రాడ్డును తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇనుప రాడ్డు ఎదురుగా ఉన్న మెయిన్ లైన్‌కు తగిలింది. దీంతో విద్యుత్ షాక్ గురై అక్కడ్కిడే మృతిచెందాడు. శివ మృతదేహాన్ని స్వగ్రామైన మొగళ్ళూరుకు శుక్రవారం తీసుకొచ్చారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని చిన్నరాయునిపల్లి గ్రామంలో కూల్ డ్రింక్ షాప్‌లో నకిలీ మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద 11 బ్రాందీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు యర్రగొండపాలెం ఎక్సైజ్ సిఐశ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. యర్రగొండపాలెం ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, మార్కాపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది చెన్నరాయునిపల్లిలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో మండ్ల బాలయోగి కూల్ డ్రింక్ షాప్‌లో నిషేధిత మద్యాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ చట్టంలోని సెక్షన్ 34(ఎ) ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'మానవతా' సేవలు అభినందనీయం

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి -కనిగిరి

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నర్సింహారెడ్డి తెలిపారు. స్థానిక టీచర్స్ అకాడమీలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం, 5వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతమంది సేవభావం కలిగిన వ్యక్తులను చూస్తుంటే చాలా ఆనందం కలుగుతుందన్నారు. ఇప్పటి వరకు సంస్థ ద్వారా చేపడుతున్న బ్లడ్ డొనేషన్, అవయవధానాన్ని కూడా ప్రోత్సహించాలన్నారు. సంస్థకు తన వంతు సహాయ సహకారలను అందించడానికి తాను ఎల్లపుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫ్ఫార్ ,కమిషనర్ పిల్లి వెంకట కష్ణా రెడ్డి, ఎన్‌హెచ్ఆర్‌సి నేషనల్ కన్వీనర్ గుత్తి శ్రీధర్, మానవతా స్వంచ్ఛంద సంస్థ జిల్లా చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ పసుపులేటి అరుణోధర్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ పెరుగు మురళీకష్ణ, జాయింట్ సెక్రటరీ కోమటిగుంట్ల బాబూరావు, శ్రీనివాసరావు, లక్ష్మీమోహన్, మున్నేళ్లి తిరుపతి రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ ధనుంజయ, పార్వతి, మరియు ఉమాకాంత్, సూరపు రాజు తులసి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

నూతన కమిటీ ఇదే...

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్‌గా వాగిచర్ల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా పసుపులేటి అరునోధర్, కన్వీనర్‌గా తనిగుండాలా శ్రీనివాస రెడ్డి, అధ్యకుడిగా పసుపులేటి వాణి కొండల రావు, సెక్రటరీగా పచ్చవా చంద్ర శేఖర్, కోశాధికారి గా రమణారెడ్డి ఎన్నికయ్యారు. నూతన కమిటీ చేత రీజినల్ డైరెక్టర్ ముక్కు బాలకష్ణ రెడ్డి ప్రమాణం చేయించారు.


సుగుణమ్మను పరామర్శిస్తున్న అన్నా వెంకట రాంబాబు

సుగుణమ్మకు 'అన్నా' పరామర్శ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల మండలం గనివేనిపాడు గ్రామానికి చెందిన మంచికల సుగుణమ్మ ఒంగోలు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో కాలికి ఆపరేషన్ చేయించుకుంది. ఈ విషయం గురించి తెలుసుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి అన్నా వెంకటరాంబాబు సుగుణమ్మను శుక్రవారం పరావ ర్శించారు. ఆమె మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. రాంబాబు వెంట వాగుమడుగు మాజీ ఎంపీటీసీ, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు చిరుగోరి చినకోటేశ్వరావు ఉన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్


ఒరిగిన విద్యుత్ స్తంభం ఇదే

మెగా ఇంజిరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో బివికె గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ విద్యుత్ స్తంభం 10 రోజులు తిరగక ముందే ఒరిగి పోయింది. సిఎస్‌పురం నుంచి డిజిపేట వెళ్లే రోడ్డులో జంక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ జంక్షన్ వద్ద విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు రోడ్డు అడ్డుగా ఉండటంతో 11 కెవి విద్యుత్ స్తంభాలను తొలగించారు. వాటి స్థానంలో నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. స్తంభాల ఏర్పాటులో నాణ్యాతా ప్రమాణాలు పాటించలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి ఓ సంభం ఒరిగి పోయింది. ఈ స్తంభం పూర్తి ఒరిగితే అరివేముల ప్రాంతంలో దాదాపు 8 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరి చేయించి ఇబ్బందులు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎఇ రసూల్‌ను వివరణ కోరగా ఆ విద్యుత్ స్తంభాలను తమకు స్వాధీనం చేయలేదని తెలిపారు. కాంట్రాక్టర్ తో మాట్లాడి ఒరిగిన స్తంభాన్ని సరిచేయిస్తామని తెలిపారు.

హామీలు అమలు చేయాలి

గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి

ప్రజాశక్తి -చీమకుర్తి

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో గొర్రెల పెంపకం దారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం (జిఎంపిఎస్) రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి కోరారు. స్థానిక పంగులూరి కష్ణయ్య భవనంలో జిఎంపిఎస్ మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిఎంపిఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు రామ్మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెద్దబ్బాయి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే తెలంగాణ తరహాలో రుణాలు ఇస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు కాలేదని పేర్కొన్నారు. జిఎంపిఎస్ నాయకుడు పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్సీడీసీ ద్వారా రూ.88 కోట్ల రూపాయలు విడుదల అయినట్లు తెలిపారు. అయితే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించుకున్నట్లు తెలిపారు. వతిదారుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను దారి మళ్లించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తామన్న హామీ అమలు కాలేదని విమర్శించారు. భూసురపల్లి, రామచంద్రాపురం గ్రామాలలో నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని జిఎంపిఎస్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రెడ్డిబోయిన సురేష్, మూరబోయిన శ్రీను, సిరిమల్లె శ్రీను, మూరబోయిన వెంకట్రావు, మేడిపోయిన శ్రీను, రావులపల్లి వెంకటేశ్వర్లు, మంగమూరు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిలారి పెద్దబ్బాయి

రేషన్ డీలర్లు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

రేషన్ డీలర్లు బాధ్యతగా పని చేయాలని తహాశీల్దారు మహ్మద్ హుస్సేన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దారు మాట్లాడుతూ కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ లోపు వద్దులందరికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ భూపతి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పి4లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-కనిగిరి

స్థానిక పామూరు రోడ్డు సచివాలయం వద్ద పి4పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు అచల రవి మాట్లాడుతూ అసమానతలు తొలగిపోయి సమాజంలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే అందరి ఇళ్లలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని తెలిపారు. అందులో భాగంగానే పబ్లిక్ -ప్రైవేట్- పీపుల్- పార్ట్‌నర్‌షిప్‌లో భాగస్వాములు కావాలన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక అద్దంకి రోడ్డులోని ఎన్ఎస్‌పి కాలనీలోనున్న శ్రీ కనకదుర్గ తల్లి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారెడ్డి కొండమ్మ తెచ్చిన పట్టు చీర, పూజ సామగ్రిలతో ఆలయ అర్చకులు బాలకష్ణచారి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం సూరపురెడ్డి వెంకటరెడ్డి, ధర్మపత్ని స్వర్ణ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

డాక్టర్ ఉగ్రను కలిసిన 'దేవకి'

ప్రజాశక్తి- కనిగిరి: వాసవీ సత్ర సముదాయాల జాతీయ చైర్మన్ మరియు జనసేన నాయకులు దేవకి వెంకటేశ్వర్లు స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి - చీరాల

ప్రజా దర్బార్‌లో ప్రజలు అందజేసే ప్రతి సమస్య పరిష్కరిస్తామని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుండి విశేష స్పందన లభించింది. 220 ఫిర్యాదులు అందాయని తెలిపారు. వాటిలో పెన్షన్‌కోసం 45, ఇళ్ల స్థలాల కోసం 165, ఇతర సమస్యలపై 10 వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా విని పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అభ్యర్థనలపై స్పందించడమే తమ బాధ్యతని అన్నారు. అధికారులు ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గం లోని అన్నీ గ్రామాల అభివృద్ధి దిశగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, క్లస్టర్ ఇంచార్జ మంగపతి, కారంపూడి పద్మిని పాల్గొన్నారు.



కుడో టోర్నీపై నరేంద్రవర్మకు వివరిస్తున్న నిర్వాహకులు

17న కుడో మార్షల్ ఆర్ట్స్ టోర్నీ

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లా స్థాయి కుడో పోరాట మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంటు ఆగస్టు 17న పట్టణంలో నిర్వహించనున్నట్లు కుడో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడే కిరణ్ కిషోర్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దివ్య తేజ శనివారం తెలిపారు. పట్టణంలోని క్రీడా వికాస కెంద్రంలో నిర్వహించే మార్షల్ ఆర్ట్స్ పోటీలకు సంబంధించిన సన్నాహాలపై శాసన సభ్యులు వేగేసేన నరేంద్ర వర్మకు వివరించామని అన్నారు. జిల్లాలో జరిగే కుడో పోరాట మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్ డెవలప్ కుడో రీగాడింగ్ టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు తమ ఎంట్రీలను ఆగస్టు 10లోగా కుడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దివ్య తేజ, ఉప్పరపాలెం చిరునామాకు పంపుకోవాలని అన్నారు.



సంతాపం తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకులు 'తుర్లపాటి' మృతి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు తుర్లపాటి గాంధీ (75) అనారోగ్య కారణంగా శుక్రవారం మృతి చెందారు. ఆయన తాపీ మేస్త్రిగా జీవనం సాగిస్తూ సిపిఎం పిలుపులన్నింటిలో పాల్గొనేవారని సిపిఎం మండల కార్యదర్శి బి అగస్టీన్ అన్నారు. గాంధీకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన పార్థివ దేహాన్ని సిపిఎం కార్యదర్శి బి అగస్టీన్, దుగ్గిరాల కార్యదర్శి జి బాలరాజు, కొల్లూరు కమిటీ సభ్యులు పంతగాని నాగమల్లేశ్వరరావు, బొనిగల సుబ్బారావు సందర్శించి మృతదేహంపై సిపిఎం ఎర్రజెండా కప్పి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోజుకు వెయ్యి క్వింటాళ్ల పొగాకు కొనాలి

- ప్రతిరోజూ 50 మంది రైతుల పొగాకు కొనాలి
- తహశీల్దారు కార్యాలయం వద్ద రైతుల ధర్నా



మాట్లాడుతున్న రైతు సంఘం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు

ప్రజాశక్తి - పంగులూరు

పొగాకు కొనుగోలు సాంద్రత పెంచాలని, రోజుకు వెయ్యి క్వింటాళ్ల పొగాకు కొనాలని, రోజుకు 50 మంది రైతుల దగ్గర పొగాకు కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు నాగబోయిన రంగారావు కోరారు. పొగాకు అమ్మిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని కోరారు. రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, రైతుల సమస్య పరిష్కారం కావాలంటే ప్రభుత్వం పొగాకు వేగంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో 5వేల ఎకరాల్లో నల్లబర్లి పొగాకు సాగు చేశారని అన్నారు. రూ.లక్షల పెట్టుబడులు పెట్టిన రైతులు, పొగాకు అమ్ముడు పోక, మండెల్లో ఉన్న పొగాకు చెడిపోతుందని ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం వ్యాపార రీత్య చూడకుండా, రైతులకు మేలు జరిగే విధంగా చూడాలని కోరారు. ప్రతిరోజు వెయ్యి క్వింటాళ్ల పొగాకు అమ్మకం జరిగితేనే రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం అమ్ముడు పోతుందని అన్నారు. లేకుంటే ఒక్క ఆకుకూడా పనికి రాకుండా పోతుందని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ప్రారంభించిన రోజున రోజుకు 300 క్వింటాళ్లు కొంటామని అధికారులు చెప్పారని, అయితే ఆచరణలో అది జరగటం లేదని అన్నారు. సరాసరిన రోజుకు 150 క్వింటాళ్లు కూడా కొనుగోలు జరగటం లేదని చెప్పారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభించి 14 రోజులైతే కేవలం 1884 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారని అన్నారు. మండలంలోని రైతుల దగ్గర ఉన్న 50 వేల క్వింటాళ్ల పొగాకు ఇదే విధంగా కొనుగోళ్లు కొనసాగితే 14 నెలలు పడుతుందని అన్నారు. పైగా వర్షాకాలం కొనుగోలు చేయడానికి ఇబ్బంది అవుతుందని అన్నారు. స్థానిక యార్డులో ఉన్న గోడౌన్లు నిండిపోతున్నాయని ఆయన చెప్పారు. కొనుగోలు సాంద్రత పెంచి వేగంగా కొనుగోలు చేయకపోతే రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు సింగారావు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీతో సెల్ఫోన్లో మాట్లాడారు. గోడౌన్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఎక్కువగా కొనలేకపోయామని, మూడు రోజుల్లో కొరిశపాడు మండలం తమ్మవరం దగ్గరకు కొనుగోలు కేంద్రాన్ని మారుస్తున్నామని, అక్కడ గోడౌన్ సౌకర్యం ఉందని ఆమె చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని అన్నారు. అనంతరం తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు రాయిని వినోద్ బాబు, గుడిపాటి మల్లారెడ్డి, నాయపాము ప్రభాకర్, సురేష్, ప్రభాకర్, అద్దంకి శ్రీనివాసరావు, సింగయ్య, కృపారావు, బాబు, కోటయ్య, అంకయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

ఒంటికాలుపై ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



బాపట్లలో ఒంటి కాలుపై నిరసన చేస్తున్న కార్మికులు



మాట్లాడుతున్న సిఐటియు చీరాల అధ్యక్షులు బాబురావు

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో భాగంగా ఒంటి కాలుపై నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె 7వ రోజుకు చేరింది. సమ్మెను ఉద్దేశించి సిఐటియు నాయకులు కె శరత్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెతో పట్టణంలో పౌర సేవలు నిలిచి పోతున్నప్పటికీ అధికారులు, పాలకులకు కనీసం చీమకుట్టినట్లైన లేదని అన్నారు. కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించక పోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయక పోవడం పట్ల కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతుందని అన్నారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేక పోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పట్ల కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. నిత్యవసర సేవలైన విద్యుత్తు, నీట సరఫరా నిలిచిపోక ముందే ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించి జీతాల పెంపుదలు చేసే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తత్కాలికంగా ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకున్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రత్నం, నాని, పట్టణ నాయకులు హరిబాబు, ప్రమీళ, సాంబిరెడ్డి, చైతన్య, ఏసమ్మ పాల్గొన్నారు.

చీరాల : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ వర్కర్స్ చేస్తున్న నిరవధిక సమ్మె 6వ రోజుకు చేరుకుందని, ప్రభుత్వం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం దిశగా హామీలు ఇచ్చిందని, అయితే వాటిని జిఒ రూపంలో అమలు చేసి సమస్య పరిష్కారానికి పూనుకోవాలని సిఐటియు డివిజన్ అధ్యక్షులు నలతోటి బాబురావు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక శాఖలో పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య రోజు రోజుకీ తగ్గిపోతున్న నేపథ్యంలో ఔట్సోర్సింగ్ కార్మికుల శ్రమ కీలకంగా మారిందని అన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో వారి పాత్ర ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. అలాంటి ఉద్యోగులకు కనీస వేతనాలు జిఒ 36 ప్రకారం వేతనాలు, రక్షణ పరికరాలు, మౌలిక హక్కులు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందని అన్నారు. కార్మికుల పోరాటం న్యాయ బద్ధమైనదని పేర్కొన్నారు. అవసరమైతే రెగ్యులర్ ఉద్యోగుల మద్దతుతో ముందుకు వస్తారని మాల్యాద్రి హెచ్చరించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎనిమిదేళ్లుగా అధికారులు సమస్యలను పరిష్కరించలేకపోతే, ఉద్యోగులు సమ్మెకు దిగడం తప్పని సరైందని అన్నారు. ఒకవైపు చర్చలు జరిపి, మరోవైపు బెదిరింపు చర్యలకు పాల్పడటం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇంజనీరింగ్ కార్మికుల జిల్లా కన్వీనర్ వీరస్వామి, సంఘం గౌరవ అధ్యక్షులు కట్టా వెంకట్రావు, విశ్వేశ్వరరావు, కిషోర్, సంగీతరావు, మురళి, గూడూరి కోటేశ్వరి, జి ఆదిలక్ష్మి, సంధ్య, బడుగు కుమారి, సునీత, స్వరూప, నూతలపాటి మరియమ్మ, రాజేశ్వరి, అయ్యప్ప, కాంతారావు, చాంద్ బాషా, నాగేశ్వరావు పాల్గొన్నారు.

రేపల్లె : ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో అర్ధ నగ్నంగా కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకుని పొర్లు దండాలు పెడుతూ శుక్రవారం నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కార్మికుల సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వానికి ఉన్నదని అన్నారు. సానుకూలంగా ఉన్నామంటూ ప్రకటనలు ఇస్తున్నారే కానీ స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జిఓ నెంబర్ 36 ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎన్ రవిబాబు, కోశాధికారి కె రాఘవేంద్రరావు, కార్మికుల రవి, శ్రీను, సుబ్బారావు, సుధాకర్, వాసు పాల్గొన్నారు.



రేపల్లెలో అర్ధనగ్నంగా పొర్లు దండాలు పెడుతున్న కార్మికులు

అద్దంకి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె శుక్రవారం 6వ రోజుకు చేరింది. ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయము వద్ద ఇంజనీరింగ్ కార్మికులు కార్మికులు ఒంటి కాలుపై నిల్చుని నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.24,500 అందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. సమ్మె మరింత ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



అద్దంకిలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు



కాలువల్లో పూడిక తీసిన దృశ్యం

కాలువల్లో పూడిక తీత

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పర్చూరు

కొద్దిపాటి వర్షానికే జలమయం' అన్న శీర్షికతో ప్రజాశక్తిలో ఈనెల 18న కథనం ప్రచురించిన వెంటనే అధికారులు స్పందించారు. స్థానిక పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలల్లో పూడిక తీయించారు. రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు పారుదల అయ్యేటట్లు చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

కనిగిరిలో బర్లీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి-పామూరు

కనిగిరిలో బర్లీ పొగాకు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన చేశారు. మండలంలో కోడిగుంపల రజసాహెబ్‌పేట, అయ్యావారిపల్లి, బోడవాడ గ్రామాల్లో రైతులను నేతలు కలిసి బర్లీ పొగాకు సమస్యలపై చర్చించారు. రైతులు కోప్పలి నాగేశ్వరరావు, పొన్నగంటి రోశయ్య మాట్లాడుతూ మండలంలో సుమారు 1000 క్వింటాళ్లు రైతుల వద్ద బర్లీ పొగాకు ఉందని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పద్ధతిలో కొనుగోలు జరిగితే నెలల తరబడి సమయం పడుతుందన్నారు. వర్షాలు మొదలవడంతో పొగాకు మండెలు తడిసిపోతాయని, దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వెంటనే కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో బర్లీ పొగాకు విస్తారంగా సాగు చేశారని, ఈ రైతులకు పొగాకు అమ్ముకోవడానికి కనిగిరిలో బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమ్మకాలపై రాజకీయం చేయవద్దని, రైతులందరికీ వరుస క్రమంలో అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద ఉన్న పొగాకు అంతటినీ పూర్తిగా కొనుగోలు చేసి ప్రతిరోజూ వెయ్యి చెక్కులను తగ్గకుండా కొనుగోలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు కె.మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వైవి నారాయణ, మాలకొండయ్య, పుల్లయ్య, బ్రహ్మయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతుల పాలిట శాపం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధర, రైతు ఇన్సూరెన్స్ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని విమర్శించారు. రైతులకు అందించాల్సిన 20 వేల రూపాయల సాయం కూడా అందలేదని, పొగాకు, శనగ, మిర్చి, వరి వంటి పంటలకు మద్దతు ధర లేదు అని చెప్పారు. దళారుల రాజ్యం కొనసాగుతుందని, 250 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇటీవల మార్కాపురం యల్లమందయ్య ఆత్మహత్య ఉదాహరణ అన్నారు. జగన్ హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ, ఆర్‌బికెల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించారని గుర్తు చేశారు. ఇప్పుడు యూరియా దొరకని పరిస్థితి ఉత్పన్నమైందని, దీనిపై మంత్రి అచ్చన్నాయుడు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇకనైనా డైవర్షన్ రాజకీయాలు మానుకుని పాలనపై దష్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో కెవి రమణారెడ్డి, కఠారి శంకరరావు, దేవా, వేములశ్రీకాంత్, రమేష్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, ముల్లంగి రవీంద్రారెడ్డి, నవీన్ రెడ్డి, పేరం ప్రసన్న పాల్గొన్నారు.

'పాత పెన్షన్'ను పునరుద్ధరించాలి..

కలెక్టరేట్ వద్ద 2003 డీఎస్సీఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



ధర్నా చేస్తున్న 2003 డీఎస్సీఉపాధ్యాయులు

మెమో 57 ప్రకారం 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు ఐక్య పోరాటాలు చేపట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరింప చేయాలని డిమాండ్ చేస్తూ 2003 డిఎస్సీ ఉపాధ్యాయులు ప్రకాశం భవన్ వద్ద ధర్నా చేపట్టారు. డిఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరమ్ నాయకులు ఎంవి సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్ కె అబ్దుల్ హై,జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రం లో సిపిఎస్ అమలుకు ముందే నోటిఫికేషన్ వెలువడి,సిపిఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2003లో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉపాధ్యాయులు పాత పెన్షన్‌కు అర్హులు. సీపీఎస్ అమలుకు ముందే ఈ నియామక ప్రక్రియ పూర్తయిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 57ను అమలు చేయకుండా ఉపాధ్యాయులను న్యాయహక్కు నుండి వంచిస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు తీసుకున్న తప్పుడు నిర్ణయాన్ని ఉద్యోగులు రాజకీయంగానే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఈసీ మెంబర్ పరిటాల సుబ్బారావు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి. శేషయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎస్ సంఘ నాయకులు పఠాన్, డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కన్వీనర్ వి. అనురాధ, డీఎస్సీ 2008 ఉపాధ్యాయుల ఫోరం నాయకురాలు శారద, జె. సుధాకర్ తదితరులు మాట్లాడారు. అనంతరం కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వై. వెంకటరావు, ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్లు జె. సుధాకర్, జె. మోజెస్, తేళ్ల ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

2027లో ముందస్తు ఎన్నికలు

వైసిపి విస్తృత సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి

ప్రజాశక్తి-దర్శి

ఈ రాష్ట్రానికి 2027 అక్టోబర్‌లో ముందస్తు ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావు అన్నారు. శుక్రవారం దర్శి లోని బూచేపల్లి ఇంటి వద్ద బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం, వైసిపి విస్తృత సమావేశం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కారుమూరి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో చంద్రబాబు ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన అనంతరం హామీలన్నీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మోడీ ముందస్తు ఎన్నికలు పెడతారని, ఈ రాష్ట్రంలో జగన్ అమలు చేసిన పథకాలన్నీ ప్రజలకు గుర్తొస్తున్నాయని తెలిపారు. ఇన్ని పథకాలు అమలు చేసిన ఈ రాష్ట్రానికి జగనే మరలా ముఖ్యమంత్రి అవుతారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి ఆర్.శ్యామల మాట్లాడుతూ పథకాలు అమలుచేయకుండా మహిళలను మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ దర్శి నియోజకవర్గానికి తమకు ఎంతో అనుబంధం ఉందని, ఎప్పుడూ ప్రజల వెంటే ఉండి ఈ నియోజకవర్గానికి సేవలందిస్తామని అన్నారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని విమర్శించారు. ఈ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ఏ ముఖ్యమంత్రీ ఇవ్వలేదని, మళ్లీ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జిల్లా నాయకులు కెవి.రమణారెడ్డి ప్రసంగించారు. ముందుగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు మోసాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీత, బ్రహ్మానందరెడ్డి, జడ్‌పిటిసి నుసుం నాగిరెడ్డి, తాతపూడి రత్నంరాజు, మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, తూము సుబ్బారెడ్డి, చింత శ్రీనివాసరెడ్డి, కాకర్ల కష్ణారెడ్డి, ఎన్నాబత్తిన సుబ్బయ్య, మాజీ ఎంపీపీలు పోచం మధుసూదన్‌రెడ్డి, వీరగంధం కోటయ్య పాల్గొన్నారు.

'విభజన చట్టం' హామీలను అమలు చేయాలి..

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



ఢిల్లీలో ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

యువజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, ఏపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుచేసి దొనకొండ ని పారిశ్రామిక కేంద్రంగా అభివద్ధి చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తామని ఇప్పటికీ ఇవ్వకుండా ఏపీ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. దొనకొండని పారిశ్రామిక కేంద్రంగా అభివద్ధి చేయాలని, దర్శిలో ఆగిపోయిన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కనిగిరిలో నిమ్జ్ ఏర్పాటు చేసి పరిశ్రమలు ఏర్పాటు చేసి.. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఒంగోలు నగర కార్యదర్శి దానియేలు, డివైఎఫ్ఐ నాయకులు కె.నవీన్, టి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో దొంగతనాలు అరికట్టాలి: సిపిఎం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలో దొంగతనాలు పెరుగుతున్నాయని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) నగర కమిటీ శుక్రవారం నాడు ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేసింది. గత కొన్ని రోజులుగా తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు లూటీ చేస్తుండటం నగర ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందని పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి రాజీవ్ నగర్‌లో నాలుగు ఇళ్లలో తాళాలు పగలగొట్టి దొంగలు దాదాపు 8 లక్షల రూపాయల విలువైన నగదు, బంగారు ఆభరణాలను అపహరించినట్లు తెలిపారు. ఒకే ప్రాంతంలో ఒక్క రాత్రి నాలుగు ఇళ్లలో చోరీలు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. సత్యనారాయణపురంలో కూడా ఇలాంటి దొంగతనం జరగడంతో ప్రజల్లో భయం పెరుగుతోందన్నారు. కొందరు అద్దె ఇంటికి తాళం వేసి బిల్డింగ్‌పై పడుకున్న సమయంలో దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువా తలుపులు తెరిచి నగదు, బంగారం అపహరించారని తెలిపారు. బాధితులు 50 వేల నగదు, రెండు సవరల బంగారు ఆభరణాలు, వెండి చోరీ అయినట్లు తెలిపారన్నారు మరో ఇంట్లో కూడా దొంగలు 20 వేల నగదు, బంగారం దోచుకుపోయారని చెప్పారు. నగరంలో వరుస చోరీలు, మద్యపాన మాఫియా, దొంగల ముఠాలు విస్తతంగా తిరుగుతున్నాయని, పోలీసులు మరింత జాగ్రత్తగా వ్యవహరించి రాత్రిపూట గస్తీని ముమ్మరం చేయాలని, దొంగలను పట్టుకొని చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకొని బాధితులకు తిరిగి అందజేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా నగరంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ కఠినంగా చేయాలన్నారు. ప్రజల ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలను నియంత్రించండి

ఒంగోలు నగరంలో కూరగాయల ధరలు సామాన్య ప్రజలకు భారంగా మారాయని, తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలు తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) నగర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నాడు నగర కమిటీ తరపున నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు గత వారం రోజులుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతూ, సాధారణ కుటుంబాలు కొనలేని స్థితి ఏర్పడిందని ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజుల్లోనే కిలోకు 15 నుంచి 30 రూపాయల వరకు ధరలు పెరిగాయని, ముఖ్యంగా బీన్స్ ధర కిలోకు 120 రూపాయలు చేరిందని వర్గాలు గుర్తుచేశాయి. కొత్తపట్నం, మార్టూరు ప్రాంతాల నుంచి కూరగాయల సరఫరా సాధారణంగా ఎక్కువగా ఉండేదని, ఈ సారి దిగుబడి తక్కువగా రావడం కూడా పెరుగుదలకు కారణమని చెప్పారు. టమాటా, బీన్స్, బీట్రూట్, క్యారెట్, పచ్చిమిర్చి, బీరకాయ, చిక్కుళ్లు, బంగాళదుంప ఇలా అన్ని రకాల కూరగాయల ధరలు గణనీయంగా పెరిగాయని వివరించారు. ఇంటింటికీ కూరగాయలు అమ్మే చిరు వ్యాపారులు కూడా అధిక ధరలు వసూలు చేస్తుండటంతో సామాన్య కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రైతు బజార్ల ద్వారా సరసమైన ధరలకు కూరగాయలు అందించాలని రవాణా సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

23న జడ్పీ స్థాయి సంఘాల సమావేశం

జడ్పీ సీఈఓ చిరంజీవి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం ఈనెల 23న జరుగుతుందని జడ్పీ సీఈఓ బి చిరంజీవి తెలిపారు స్థాయి సంఘాల అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో సభ్యులు అధికారులు హాజరై స్థాయి సంఘాల సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు

ఇలాగైతే చివరి ఆకు కొనేదెప్పుడు?



కల్లంవారిపాలెం పాఠశాల పరిశీలిస్తున్న అధికారులు

పాఠశాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కలంవారిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఉదయం కురిసిన వర్షపు నీరు పాఠశాల్లో నిల్వ ఉండి విద్యార్థులకు ఇబ్బందిగా ఉండటం అధికారులు గమనించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సింగారావు, ఎంపిడిఒ స్వరూపరాణి, ఎంఇఒ వీరాంజనేయులు మాట్లాడుతూ పాఠశాల శిథిలావస్థకు చేరిందని గ్రహించిన పాఠశాల హెచ్ఎం, గ్రామ పెద్దలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించామని అన్నారు. పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం పాఠశాలకు దగ్గర్లోని 25 సెంట్లు ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుత పాఠశాల పక్కన ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండటంతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని విలేజ్ సెక్రటరీ ద్వారా ఆ స్థల యజమానికి నోటీసు ఇచ్చి స్థలాన్ని శుభ్రం చేయాలని ఆదేశించారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ సింగయ్య

చెత్త వేరు చేసి ఇవ్వాలి

ప్రజాశక్తి - అద్దంకి

గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందుకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వేయాలని ఎంపిడిఒ బి సింగయ్య సూచించారు. మండలంలోని మోదేపల్లి గ్రామంలో ఇంటింటి నుండి చెత్త సేకరణను ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. జూన్ నెలకు సంబంధించి ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా సేకరించిన సమాచారంలో భాగంగా గ్రామంలో 27 శాతం మంది మాత్రమే సంతృప్తితో మూడో స్థానంలో ఉండారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల సముదాయాల పక్కన పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చెత్త సేకరణ అంబాసిడర్లకు చెత్త ఇవ్వాలని అన్నారు. వర్షా కాలం దృష్ట్యా మురుగు నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న డాక్టర్ రాహుల్

కోలాట బృందానికి విరాళం

ప్రజాశక్తి - నగరం

మండలంలోని యేలేటిపాలెం శ్రీ నీలంపాటి లక్ష్మీ అమ్మవారి కోలాట బృందానికి డాక్టర్ క్రాప రాహుల్ కుమార్ రూ.15వేల విరాళం తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి అకిశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా శుక్రవారం అందచేశారు. కోలాట బృందానికి ఆర్థిక సహాయం చేసిన డాక్టర్ క్రాప రాహుల్ కుమార్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఐక్యంగా ఉండాలని, సాంప్రదాయాల్లో భాగమైన కోలాటంలో మహిళలు అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. యేలేటిపాలెం అభివృద్ధిలో భాగంగా భవిష్యత్తులో సేవ కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో వెలమవారిపాలెం, యేలేటిపాలెం టిడిపి నాయకులు నాన్న జయరావు, పరిశ శ్యాంబాబు, మస్తాన్ వలీ, శంకర్ బాబు, నాంచారయ్య పాల్గొన్నారు.

- పొగాకు కొనుగోలుపై రైతుల అనుమానాలు
- పొగాకు కొనాలంటే ఎన్ని రోజులు పడుతుంది
- అప్పటిదాకా పొగాకు చెడిపోకుండా ఉంటుందా
- వెనక్కి పంపే పొగాకు ఏం చేసుకోవాలి
- మంత్రుల మాటలు అమలయ్యేదెప్పుడు
- రైతుల అనుమానాలు, సవాలక్ష ప్రశ్నలు

ప్రజాశక్తి - పంగులూరు

రైతులు ఇళ్లకు పొగాకు చేరి 5 నెలలుగా వస్తుంది. ఒక వైపు పొగాకు చెడిపోయే దశకు వచ్చింది, మరో వైపు రైతుల దగ్గరున్న చివరి ఆకు వరకు కొంటామన్న రాష్ట్ర మంత్రుల మాటలు అమలు కావడం లేదు. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియక రైతులు అయోమయ స్థితిలో పడిపోతున్నారు. మండలంలో 5వేల ఎకరాల్లో (ప్రభుత్వ లెక్కల్లోకి రానిది ఇంకా ఉంది) రైతులు నల్లబర్లి పొగాకు సాగు చేశారు. ఎకరాకు 10 క్వింటాలు చొప్పున 50వేల క్వింటాల పొగాకు రైతు దగ్గర ఉంది. రైతులను ప్రోత్సహించి, అధిక విస్తీర్ణంలో సాగు చేయించిన ప్రైవేటు కంపెనీలు, తీరా రైతుల వద్దకు పొగాకు రావడంతో మొఖం చాటేశాయి. కనీసం సిబ్బంది ఫోన్లు కూడా తీయకుండా తప్పించుకున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు, రైతు సంఘం ఆందోళన ఫలితంగా దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. మార్క్‌ఫెడ్ పొగాకు కొనుగోలు సాంద్రత తగ్గి, రైతుల కన్నీళ్లు తురవడానికి కొనుగోలు ప్రారంభించామన్నట్లు జరుగుతుంది. గత నెల 30న స్థానిక మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ పొగాకు కొనుగోలు ప్రారంభించింది. రోజుకు రెండు వందల క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని, దీన్ని 500 క్వింటాళ్ల వరకు తీసుకువెళతామని, కొనుగోలు జరిగిన మూడు రోజులకు రైతుల ఖాతాల్లోకి డబ్బులు వేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు రైతులకు చెప్పారు. అంతే కాకుండా ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లాకు చెందిన మంత్రి



పొగాకు చెక్కులు పరిశీలిస్తున్న అధికారులు

గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రైతుల దగ్గర ఉన్న చివరి ఆకు వరకు ప్రభుత్వం కొంటుందని, రైతులు ఇబ్బంది పడాల్సిన పనిలేదని, రైతుల క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. అయితే ఆచరణలో మాత్రం ఇవేవీ అమలు జరగటం లేదు. పైగా కొనుగోలు విధానం చూస్తే అసలు తమ పొగాకును కొంటారో లేదో కూడా తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు రైతులకు మెసేజ్ పంపి పొగాకు తెప్పించుకుంటున్నారు. అయితే మెసేజుల్లో ఒక్కో రైతుకు వంద నుండి 120 చెక్కుల వరకు తీసుకురమ్మని మెసేజ్ పెడుతూ ఆచరణలో మాత్రం 20 చెక్కులకు మించి తీసుకురావద్దని చెబుతున్నారు. తీసుకువచ్చిన చెక్కులను కూడా నాణ్యత పేరుతో మొదటి గ్రేడు పొగాకును 2వ గ్రేడుగా చూపి రూ.9 వేలు, 2వ గ్రేడును 3వ గ్రేడుగా చూపి రూ.6వేలు ధర వేస్తున్నారు. 3వ గ్రేడ్‌గా ఉన్న ఆకును ఇది పనికిరాదంటూ వెనక్కి పంపిస్తున్నారు. ఈ విధంగా ప్రతిరోజు కొనుగోలు కేంద్రానికి వచ్చిన చెక్కుల్లో మూడు వంతుల చెక్కులు రైతులు వెనక్కి తీసుకెళ్లాల్సి వస్తుంది. చివరి గ్రేడును వెనక్కి పంపిస్తే ఆ పొగాకు ఏమి చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా రైతులు తెచ్చిన పొగాకును కాకుండా కొంత మంది వ్యాపారులు రైతుల దగ్గర నుండి కొని ఇక్కడ అమ్ముకుంటున్నారనే ప్రచారం జరుగుతుంది. అందువలన రైతులకు తెచ్చిన పొగాకు ఎక్కువగా వెనక్కి పంపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పొగాకు కొనుగోలు చేసిన మూడు రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పిన మాట నీటి మూటగానే మిగిలిపోయింది. 17రోజుల క్రితం అమ్మకం జరిగిన చెక్కులకు ఇంత వరకు డబ్బులు రాలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికీ పొగాకు కూలీలకు కూడా కూలి డబ్బులు ఇవ్వలేదని, పిల్లల ఫీజులకు, వ్యవసాయ పనులకు డబ్బులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. ఇకపోతే రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు కొంటామని మంత్రులు చెప్పిన మాటలు ఎంత మాత్రం నమ్మశక్యంగా లేవని రైతులు అంటున్నారు. మండలంలో 50 వేల క్వింటాళ్ల పొగాకు దిగుబడి వచ్చింది. అయితే గత 17 రోజులుగా 1984.88 క్వింటాళ్లు మాత్రమే పంగులూరులో కొనుగోలు చేశారు. ఈ విధంగా కొంటే రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేయాలంటే 15నెలలపైగా పడుతుంది. అప్పటి దాకా రైతులు వద్ద ఉన్న పొగాకు ఏ మాత్రం పనికిరాదు. పైగా పంగులూరు మార్కెట్ యార్డులో ఉన్న గోడౌనులు ఇంకా ఒకటి రెండు రోజుల్లో నిండిపోతాయని, పొగాకును నిల్వ చేయడానికి ఇక అవకాశం లేదని, అందువలన కొనుగోళ్లు ఆపే పరిస్థితి ఉందని కొంతమంది చెబుతున్నారు. పైగా వర్షాకాలం వచ్చింది. వర్షం ఒకరోజు కురిస్తే 20 రోజులు దాకా కొనుగోలు చేసే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు తమ దగ్గర ఉన్న పొగాకు మొత్తం ఎప్పటికి అమ్ముకోవాలి అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ వైఖరి చూస్తుంటే రైతుల కన్నీళ్లు తుడిచేందుకు మాత్రమే కొనుగోలు ప్రారంభించినట్లు రైతులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో అర్థం కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల బాధ అర్థం చేసుకొని కొనుగోలు సాంద్రతను పెంచి, వేగంగా కొనుగోలు సాగించి, రైతుల అనుమానాలకు చెక్ పెట్టాలని, రైతులందరికీ న్యాయం జరిగే విధంగా కొనుగోలు లిస్టును ఏరోజుకారోజు కొనుగోలు కేంద్రం దగ్గర ఉంచి, పకడ్బందీగా కొనుగోలు నిర్వహించాలని, రైతు దగ్గర ఉన్న చివరి ఆకును వీలైనంత త్వరగా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

20న కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - కారంచేడు

కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలు జూలై 20న మండలంలోని స్వర్ణ గ్రామంలో జరుగుతున్నాయని కౌలు రైతు సంఘం నాయకులు పి కొండయ్య తెలిపారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి సంఘం విశేష కృషి చేసిందని అన్నారు. గతేడాది కొమ్మమూరు కాలువకు నీరు రాక పైర్లు ఎండిపోతున్న స్థితిలో కారంచేడులో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించినట్లు తెలిపారు. వార బంది సక్రమంగా అమలు జరిపినట్లు తెలిపారు. కాల్వ దిగువ దాకా నీరు వచ్చే విధంగా కృషి చేసినట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అమలు చేయడానికి, ఈ ఏడాది నల్లబర్లి పొగాకు సమస్యపై రైతు సంఘంతో కలిసి కౌలు రైతు సంఘం సుదీర్ఘ పోరాటం చేసిన తర్వాతే ప్రభుత్వం ముందుకు వచ్చి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ప్రారంభించిన సంగతి తెలిసిందేనని అన్నారు. కౌలు కార్డులు కౌలు రైతులందరికీ ఇవ్వడం కోసం, పంట నష్టపరిహారం వంటి రాయితీ పొందడానికి కౌలు రైతు సంఘం విశేష కృషి చేస్తుందని అన్నారు. ఈ క్రాప్ చేయించడం ద్వారా పంట వేసిన కౌలు రైతుకు నష్ట పరిహారం వచ్చేలాగా జిఒను సాధించినట్లు తెలిపారు. దేవాదాయ భూములు సాగు చేస్తున్న రైతులందరికీ దేవాదాయ శాఖ ద్వారా కౌలు కార్డులు ఇచ్చే విధంగా కృషిచేసి విజయం సాధించినట్లు తెలిపారు. అందువల్ల చేసిన కృషిని సమీక్షించుకొని రాబోయే కాలంలో జిల్లాలో కౌలు రైతులు దేవాదాయ భూములు సాగు చేస్తున్న రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కౌలు కార్డులు సాధించేందుకు చేయాల్సిన కృషిని చర్చించు కునేందుకు సంఘ నిర్మాణాన్ని బలపర్చుకునేందుకు జరిగే మహా సభలు జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభ మండలంలోని స్వర్ణ గ్రామ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరుగుతుందని చెప్పారు. స్థానిక స్వర్ణమ్మ గుడి సెంటర్లో సాయంత్రం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. మహాసభ, బహిరంగ సభలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, పి కొండయ్య, ఏడుకొండలు పాల్గొంటారని తెలిపారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులివ్వాలి

ప్రజాశక్తి - చిన్నగంజాం

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే ఉద్దేశంతో కొనుగోలు చేసిన ధాన్యానికి రెండు నెలలు గడిచిన డబ్బులు ఇవ్వకపోవడం ఏమిటని మండలంలోని కొత్తపాలెం సర్పంచి ఆసోది బ్రహ్మారెడ్డి ప్రశ్నించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ గ్రామంలో ప్రైవేటు స్కూలు అద్వానంగా ఉన్నప్పటికీ ఎంఇఒ ఎలా అనుమతి ఇచ్చారని నిలదీశారు. మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ హౌసింగ్ ఇళ్ల ఇప్పిస్తానని డబ్బు వసూళ్ల చేస్తూ లబ్ధిదారులను మోసం చేశారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు ప్రభాకరరావు

తహశీల్దారు జె ప్రభాకరరావు మాట్లాడుతూ రైతులు ఆధార్‌లో తప్పులు సరిచేసుకుంటే అన్నదాత సుఖీభవ డబ్బులు వెంటనే జమవుతాయని తెలిపారు. ఎంపిడిఒ విజయ, ఎపిఎం గద్దె సుబ్బారావు పాల్గొన్నారు.



బాలికలు అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ జె సుభద్ర

బాల్యవివాహాలు చేయొద్దు

ప్రజాశక్తి - పర్చూరు

బాల్య వివాహాలు చేయొద్దని సిడిపిఓ జె సుభద్ర తెలిపారు. ఐసిడిఎస్ పర్చూరు ప్రాజెక్టు పరిధిలోని పర్చూరు జడ్పీ హై స్కూలు బాలికలకు విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరం అవుతుందని చెప్పారు. బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. వారికి ఆపద సమయంలో చైల్డ్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 వినియోగించుకోవాలని తెలిపారు. బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, విద్య నేర్చుకోవడం ద్వారా ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగిరెడ్డి, సూపర్వైజర్, అంగన్వాడి కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

20న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

ఒంగోలు ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్య శిబిరం సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు పరీక్షలు చేస్తారని తెలిపారు. సాధారణ వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్లవ్యాధులు, కంటి వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు, ఆయాసం, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. వివరాలకు 9492120399 నెంబర్‌లో సంప్రదించాలని అన్నారు.



పదవులు పొందిన వారిని అభినందిస్తున్న అశోక్ బాబు

వైసిపి సంస్థాగత నేతలకు అభినందనలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు పలువురికి పార్టీ సంస్థాగత పదవులు కేటాయించారు. ఎంపిటిసి కౌతరపు పద్మావతికి వైసిపి అంగన్వాడి విభాగం మండల అధ్యక్షురాలుగా నియమితులు అయ్యారు. ఆర్టిఐ అధ్యక్షులుగా కౌతరపు శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షులుగా కుక్కల వెంకటరామయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా జంగం వాసు నియమితులయ్యారు. పదవులు పొందిన నాయకులు తమకు పదవులను అప్పగించిన అశోక్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అశోక్ బాబు తోపాటు పద్మావతి, వెంకట్రామయ్య, శ్రీనివాసరావు, వాసును దుశ్యాలవాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి డివి లలిత కుమారి, ఎంపిటిసిలు గద్దె సుశీల, రావు రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యులు నబి, వైసిపి మండల కన్వీనర్ పడమట శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, వేల్పూరు నాగేశ్వరరావు, సిరాజుద్దీన్, మద్దుల గిరి, పసుపులేటి శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

సుపరిపాలనపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని గీతా మందిరం ఎదురు బజారులో ఇంటింటికి కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై ప్రచారం శుక్రవారం నిర్వహించారు. కుటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దాలు సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సారాజ్యంలో సుపరిపాలన సాగుతున్నట్లు తెలిపారు. టిడిపి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు చుండూరి మురళి సుధాకరరావు, తెలుగుదేశం నాయకులు అంకం నాగరాజు, ఎఎంసి డైరెక్టర్ కురిచేటి సుబ్బారావు, బాణాల రవికుమార్, విద్యాసాగర్, బొప్పుడి లక్ష్మీనారాయణ, సామా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'పి4'పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతరం సచివాలయం నందు 'పి4'పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి దొప్పలపూడి మోహన్ బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపిడిఓ మహమ్మద్ అఖీమ్ జావేద్ మాట్లాడుతూ ఇంకా ఎవరైనా 'పి4' సర్వేలో నమోదు కానట్లయితే అలాంటి వారు ఎన్రోల్ చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ ఎండిఒ పిటివి కృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరుగా చేసి ఇళ్ల వద్దకు వచ్చే పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సూరవరపుపల్లి కార్యదర్శి తేజస్సు ప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి, మహిళా పోలీసు స్వాతి, వెటర్న్ అసిస్టెంట్ ఏసు, అనంతవరం, సూరవరాపుపల్లి నాయకులు కోయ సతీష్, గుదే తారక రామారావు, సాంబశివరావు, గుత్తా వాసుబాబు, వేణుబాబు, సింగూ నాగేశ్వరరావు, వీరయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్య భద్రత

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో ఐఈఈఆర్‌డి స్వచ్ఛంద సేవా సంస్థ నేషనల్ మెడిసినల్ ప్లాంట్ బోర్డు సహకారంతో 2025-26 సంవత్సరానికి ఔషధ మొక్కల పంపిణీ కార్యక్రమం ఎంఈఓ ఎ శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో తులసి, అశ్వగంధ, బ్రాహ్మి, అలొవెరా, శతావరి, కాలమేఘ, మందార, ఎర్రచందనం, శ్రీగంధం విటమిన్స్, వాము, అల్లం, ఉసిరి, పిప్పింట, రణపాల మొదలైన 30 రకాల మొక్కలు నాటారు. వీటిలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే మొక్కలు ఉన్నాయని అన్నారు. స్థానిక ప్రజలు, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, ఆయుర్వేద ఔషధాలపై అవగాహన పెంచే లక్ష్యంతో ఐఈఈఆర్‌డి చేస్తున్న సేవను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి గంగాధర్, సిఆర్పి ఎం రమేష్, ఐఈఈఆర్‌డి సంస్థ అధ్యక్షులు బత్తుల కిరణ్ చంద్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- రైలు కింద పడ్డ విద్యార్థి
- రెండు కాళ్లు కోల్పోయిన బాలిక

ప్రజాశక్తి - బాపట్ల

తోటి విద్యార్థుల ముందు పాఠశాల హెచ్ఎం దూషించిందని 10వ తరగతి విద్యార్థిని రైలు కిందపడి ఆత్మహత్య యత్నంకు పాల్పడింది. ఘటనలో ఆమె తన రెండు కాళ్లు కోల్పోయింది. బాపట్ల కలెక్టరేట్ సమీపంలో రైలు పట్టాలపై శుక్రవారం పొద్దు పోయాక ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని వెంగళ విహార్‌కు చెందిన విద్యార్థిని తల్లి చింతా కుసుమ తెలిపిన వివరాలు ప్రకారం తమ కుమార్తె సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతోంది. రెండు రోజుల నుండి స్కూలుకు వెళ్లకపోవడంతో ఎందుకు వెళ్లడం లేదని నిలదీస్తే ప్రధానోపాధ్యాయురాలు తోటి విద్యార్థుల ముందు తనను తప్పు చేశానని, తాను సరిగ్గా మార్కులు సాధించకపోయినా 10వ తరగతికి సిఫార్సు చేశానని, ఈ విధంగా వ్యవహరిస్తే పది పాస్ అవ్వవని తోటి విద్యార్థుల ముందు హేళనగా మాట్లాడి దూషించిందని, తాను ఆ స్కూలుకు వెళ్ళను అంటూ తనకూతురు చెప్పిందని తల్లి కుసుమ చెప్పింది. ఆమె తండ్రి వెళ్లి ప్రిన్సిపాల్‌తో మాట్లాడతాడని, రేపటి నుండి స్కూలుకు వెళ్ళమని తల్లి నచ్చజెప్పినట్లు తెలిపారు. సరేనని వాష్ రూంకి వెళ్లి వస్తానని చెప్పి స్థానిక కలెక్టరేట్ వద్ద గుంటూరు ఫ్లైఓవర్ కింద రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. కీర్తన రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిందని, రెండు కాళ్లు కోల్పోయిందని స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన విద్యార్థినిని స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యశాల్లో డాక్టర్ ప్రియాంక, డాక్టర్ భరత్ ప్రథమ చికిత్స అందించి గుంటూరు సర్వజన ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు విద్యార్థిని తల్లి కుసుమ వద్ద వివరాలు సేకరించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రెండు కాళ్లు కోల్పోయిన విద్యార్థిని

ప్రిన్సిపల్‌పై దళిత సంఘాల ఆగ్రహం

కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య యత్నంకు పాల్పడి, రెండు కాళ్లు కోల్పోయిన విద్యార్థిని చింత కీర్తనకు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు జి చార్వాక, వినయ్ కుమార్, కాగిత సుధీర్ డిమాండ్ చేశారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకుని విద్యార్థినికి న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే సహించేది లేదు

శాసన సభ్యులు నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందించే పథకాలు అర్హులైన మహిళలకు అందించడంలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ పేదరిక నిర్మూలన నింశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా అందించే రుణాల్లో ఇటీవల కొన్ని సంఘాల్లో జరిగినా అవక తవకలకు సంబంధించి ఆర్థిక వివాదాలు తమ దృష్టికి వచ్చాయని అన్నారు. అర్హులైన మహిళలను మోసం చేసే దిశగా ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. మహిళా ఆకాశం యాప్ ద్వారా మహిళల కుటుంబ ఆర్థిక స్థితిగతులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చే విధంగా మెప్మా సిబ్బంది కృషి చేయాలని అన్నారు. పిఎం స్వానిధి ద్వారా వీధి వ్యాపారులకు అవసరమైన రుణాలు అందించి వారి ఉపాధికి తోడ్పాటు అందించాలని అన్నారు. ప్రధానంగా మహిళల్లో ప్రతి కుటుంబం నుండి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానంపై క్షేత్రస్థాయిలో డ్వాక్రా మహిళల నుండి ప్రతి కుటుంబంలో మహిళలకు దీనిపై అవగాహన కల్పించాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే విధంగా కృషి జరగాలని అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధంపై జరిగే కార్యక్రమంలో మహిళలు పాల్గొనాలని అన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్థానంలో గుడ్డ సంచులు తయారు చేసి విక్రయించే విధంగా డ్వాక్రా సంఘాల మహిళలు ముందుకు రావాలని అన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధిస్తే వాటి స్థానంలో తక్షణమే గుడ్డ సంచులు అందించే విధంగా మెప్మా ద్వారా పట్టణంలో స్వయం సహాయక సంఘాలు దీనిపై తక్షణ చర్యలు చేపట్టి స్వయం సహాయక సంఘాల్లో కుట్టుమిషన్లు ఉన్న ప్రతి ఒక్కరితో గుడ్డ సంచులు తయారు చేయించాలని అన్నారు. పట్టణంలో పనిచేసే 65 మంది ఆర్పీలు పేదరిక నిర్మూలన చేపడుతున్న కార్యక్రమాలపై పారదర్శకత పాటించాలని అన్నారు. తొలుత సంఘంలో సభ్యురాలికి రూ.3.50లక్షల బ్యాంకు రుణంతో బ్యాటరీ ఆటోను పంపిణీ చేశారు. సమావేశంలో కమిషనర్ రఘునాధరెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకృష్ణ, మెప్మా సిఎంఎం సుబ్రహ్మణ్యం, ఆర్పీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాటరీ ఆటో ప్రారంభిస్తున్న నరేంద్రవర్మ

బధిరుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని వెదుళ్ళపల్లి సమీపంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్ డిఎస్ రజియా శుక్రవారం తెలిపారు. బాల, బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏ జిల్లాకు చెందినవారైన తమ పాఠశాల్లో ప్రవేశానికి అర్హులని అన్నారు. 1వ తరగతిలో చేరేందు కు 6ఏళ్ళ నుండి 8ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని తెలిపారు. వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికేట్, పాఠశాల బదిలీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీతో తమ పాఠశాల్లో సంప్రదించాలని అన్నారు. ఉచిత విద్య, హాస్టల్, భోజనంతో పాటు ప్రభుత్వం కల్పించే అన్ని రకాల సదుపాయాలు ఉచితంగా కల్పిస్తున్నామని అన్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, అత్యాధునిక సంకేతిక పరిజ్ఞానంతో చదువు నేర్పుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏటా 10, ఇంటర్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాదిస్తున్నారని తెలిపారు. ఆసక్తిగల బధిర (మూగ, చెవిటి) విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 90000 13633, 99483 72899, 92461 43198 నెంబర్ల ద్వారా సంప్రదించాలని తెలిపారు.



బధిరుల ఆశ్రమ పాఠశాల



సీఎం సహాయ నిధి అందజేస్తున్న ఆనందబాబు

సీఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - వేమూరు

అనారోగ్యంతో ప్రైవేట్ వైద్యశాల్లో చికిత్స పొందుతున్న పలువురు బాధితులకు సిఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదగా శుక్రవారం అందజేశారు. చుండూరు మండలం యడ్లపల్లికి చెందిన మొహమ్మద్ ఇర్ఫాన్‌కు రూ.35వేలు, కొల్లూరు మండలం దోనేపూడికి చెందిన కాట్రగడ్డ రాజ్యలక్ష్మికి రూ.43,984, భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన కౌతావరపు శివ శంకర సాంబశివరావుకు రూ.69,100 చొప్పున మొత్తం రూ.1,48,084 బాధితుల కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందజేశారు.



హాస్టల్‌కు ఫ్యాన్లు బహుకరిస్తున్న దృశ్యం

వసతిగృహానికి ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి - వేటపాలెం

జివికెసి స్వామి దయానంద సేవా ఆశ్రమానికి వంకా రవికుమార్, బొంబాయి సురేష్ ద్వారా తెలుసుకుని గుంటూరు వాస్తవ్యులు గుడిపూడి వెంకటసురేష్, నరేష్ కుమార్ విద్యార్థులకు సౌకర్యం ఏర్పాటు నిమిత్తం రెండు ఫ్యాన్లు శుక్రవారం అందజేశారు. అనంతరం అల్పాహారం గుడిపూడి సుబ్రహ్మణ్యం గుప్త అందజేశారు. కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు, సూర్యకుమారి, శైలజ, సుకన్య, సుబ్రహ్మణ్యం, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుబి మేనేజర్ వీరయ్య

జన సురక్ష యోజనపై అవగాహన

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతరం రాములవారి గుడి వద్ద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామ జన సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. యుబి బ్రాంచ్ మేనేజర్ వీరయ్య అధ్యక్షత వహించారు. ఆర్‌బిఐ ఆదేశాల మేరకు సొసైటీ ఫర్ సోషియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవ సమస్థ సహకారంతో 3 నెలల పాటు జరిగే గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా అనంతవరం, చీమటవారిపాలెం గ్రామాల్లో గ్రామ స్థాయి జనసురక్ష నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్ పాల్గొన్నారు. పునూరు యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీను నాయక్, అసిసెంట్ మేనేజర్ రాజేష్, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. మార్టూరు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కాన్సిలర్లు కోటేశ్వరరావు, చినబాబులు మాట్లాడుతూ జన సురక్ష క్యాంపులో భాగంగా ప్రతి ఒక్కరు ప్రధాన మంత్రి జన ధన యోజన ఖాతాలు కలిగివుండాలని, సామాజిక భద్రత పథకాలైన ప్రథమంత్రి సురక్ష్య బీమా, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన కలిగి ఉండాలని చెప్పారు. ఆన్లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత పడాలని, తదితర బ్యాంకు సేవలు అంది పుచ్చుకోవాలని ప్రజలకు తెలిపారు .

2,529 మెట్రిక్ టన్నుల

బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాస్థాయి పొగాకు కొనుగోలు కమిటీ సమావేశంలో పలు అంశాలను ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన 2,529.650 మెట్రిక్ టన్నుల బ్లాక్ బర్లి పొగాకును జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ సమావేశంలో ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కొనుగోలు చేసిన పొగాకును గోడౌన్లలో కొంతవరకు పెట్టడం జరిగిందన్నారు. మిగిలిన పొగాకును వేరొక పెద్ద గోడౌన్లకు తరలించి, ప్రస్తుతం ఉన్న కొనుగోలు కేంద్రాల్లో పొగాకు కొనుగోలుకు తీర్మానించడం జరిగిందన్నారు. బ్లాక్ బర్లి పొగాకును తరలించడానికి టెండర్ల కోసం జిల్లా మేనేజర్ కు ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. పొగాకు రైతులకు గ్రేడింగ్ మీద అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న ప్రాథమిక పరపతి సంఘాల అకౌంటబిలిటీ గురించి డిసిఒ ను పర్యవేక్షణ కోసం ఆదేశించామని తెలిపారు. కొనుగోలు చేసిన పొగాకును నిలువ చేసేందుకు కొత్త గోడౌన్ల అన్వేషణ కోసం జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారులకు, జిల్లా మేనేజర్ కు బాధ్యతలు అప్పగించడమైందని ఆయన తెలిపారు. పొగాకు కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా మార్కెటింగ్ అధికారిని ఆదేశించామన్నారు. రైతుల యొక్క పొగాకు నాణ్యత, ప్రమాణాల బాధ్యత బయ్యర్లకు, ప్రాజెక్టు మేనేజర్ కు అప్పగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డి ఎం కరుణశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకష్ణ, బాపట్ల,చీరాల రెవెన్యూ డివిజన్ అధికారులు పి గ్లోరియా, చంద్రశేఖర్, వీక్షణ సమావేశం ద్వారా ఎ.పి ప్రాజెక్టు మేనేజర్ రాజు, ఏపీ ఎంఎఫ్ లు పాల్గొన్నారు.

పథకాల అమలును వేగవంతం చేయాలి..

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రెవిన్యూ శాఖ నిర్వహించే వివిధ ప్రభుత్వ పథకాల అమలు, పనితీరును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు పలు సూచనలు చేశారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు సంబంధించి ఆధార్ వెరిఫికేషన్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించిన ఆధార్ వెరిఫికేషన్, వెబ్ లాండ్‌లో మార్పులు చేర్పులను ఈ నెల 23వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. రైతుల వద్ద నుంచి నీటి సుంకాల వసూలుకు తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పి4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను నిర్ధారించుటలో వారి స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.వారి తలసరి ఆదాయం రూ.15 లక్షల లోపు ఉంటే వారిని మార్గదర్శకులుగా తీసుకోవద్దని, వారి సంవత్సర ఆదాయం రూ.50 లక్షల వరకు ఉంటే వారిని మార్గదర్శకులు కింద చేర్చుకోవాలని అధికారులకు సూచించారు. ఒక్కో మార్గదర్శికి 10 బంగారు కుటుంబాలను మాత్రమే కేటాయించాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ గంగాధర్ గౌడ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కనకరాజు, సిపిఓ షాలేమ్ రాజు, బాపట్ల,చీరాల,రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారులు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, బాపట్ల, చీరాల,రేపల్లె డిఎల్‌డివోలు పాల్గొన్నారు.

మైక్రో ఆర్టిస్ట్ మహితకు ఆర్థిక ప్రోత్సాహం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చీరాలకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ అన్నం మహిత జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళిని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. తన అద్భుతమైన కళా ప్రతిభతో మహిత 93 పెన్సిల్స్‌పై నెల్సన్ మండేలా జీవిత చరిత్రను, మరో 810 పెన్సిల్స్‌పై మహాభారతంలోని 700 శ్లోకాలను అత్యంత సూక్ష్మంగా చెక్కి అందరి ప్రశంసలు అందుకున్నారు.మహిత అసాధారణ ప్రతిభను కలెక్టర్ మురళి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, తన వంతు సహాయంగా రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో మహితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎం మాల కొండయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించి, జీతాలు పెంచేంత వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. శనివారం నాడు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మానవహారం నిర్మించారు. జీవో నంబర్ 36 అమలు చేసి, సమ్మెకాలపు ఒప్పందాలు, రిటైర్మెంట్ బెనిఫిట్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రజలకు కీలక సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్చలకు రాకపోతే పట్టణాలు కంపుకొడతాయని, ఇతర ట్రేడ్ యూనియన్లతో కలసి ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల పోరాటానికి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు జి.శేషయ్య మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు జి. నరసింహ, టీ. విజయమ్మ, జాలయ్య, శంకరు, శివమ్మ, శ్రీదేవి, ఆర్. శ్రీనివాసరావు, కే. వెంకటేశ్వర్లు, కే. మోహన్ రావు, భారతి, వంశీ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే. సామ్రాజ్యం, బి. బాబు, ఎం. బాబు, జేమ్స్, అనిత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

'కూటమి' పాలనపై ప్రజల హర్షం

ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేస్తుందని, పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో 11, 13 డివిజన్లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆయా డివిజన్లకు చేరుకున్న ఒంగోలు ఎమ్మెల్యే, ఎంపీలకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఆయా డివిజన్లోని ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివద్ధి కార్యక్రమాల కరపత్రాన్ని వారు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు బండారు మదన్, ప్రధాన కార్యదర్శి బోడపాటి వెంకట్, కొఠారి నాగేశ్వరరావు, వై శశికాంత్ భూషణ్,



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట

చుండి శ్యామ్ , మహిళా నాయకురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి, టి అనంతమ్మ, అజిమూన్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వేగంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో అభివద్ధి పనులు వేగంగా జరిగాయని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని దొడ్డవరప్పాడు గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ఏడాది పాలనపై ఇంటింటికీ తిరిగి గ్రామస్తులకు వివరించారు. గ్రామ అభివద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. అదేవిధంగా చంద్రబాబు రాష్ట్ర అభివద్ధికి చేస్తున్న కషిని వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అడక స్వాములు, టిడిపి మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్

సలహాదారులు, మాజీ మండల అధ్యక్షులు మండవ జయంత్ బాబు, సీనియర్ నాయకులు మండవ రంగారావు, మండవ వెంకటస్వామి, పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన



వెంచర్‌ను తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి మార్కాపురం

మార్కాపురం పట్టణానికి అతి సమీపంలో పెద్దనాగులవరం ఇలాఖాలో ప్రభుత్వ అసైన్డ్ భూమితో పాటు వాగు పోరంబోకు భూమి నాలుగు ఎకరాలు ఆక్రమించి.. వెంచర్ వేశాడు ఓ రియల్ వ్యాపారి. దీనిపై 'రూ. 5 కోట్ల విలువైన భూమి... కబ్జాకు యత్నం' అనే శీర్షికతో ప్రజాశక్తి టాబ్లాయిడ్‌లో శుక్రవారం కథనం వెలువడింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఇక్కడి రెవెన్యూ అధికారుల్లో కదలిక వచ్చింది. మార్కాపురం తహశీల్దారు కె.చిరంజీవి, ఇతర రెవెన్యూ సిబ్బంది ఆక్రమిత ప్రభుత్వ భూమిలో వేసిన వెంచర్‌ను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఆక్రమణదారుడిని ఈ సందర్భంగా విచారించారు. శనివారం ఉదయం నాటికి ఆక్రమిత స్థలంలో కంచె తీసేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు.

న్యాయం చేస్తారా.. చావును చూస్తారా.!

పట్టణానికి అతి దగ్గరలోని పెద్ద నాగులవరం ఇలాఖాలో ప్రభుత్వ భూమితో పాటు కొంత ప్రయివేటు వ్యక్తుల భూమి కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించినట్లు తేలింది. ఆ వెంచర్‌లో వాగుపోరంబోకు భూమి, ప్రభుత్వ అసైన్డ్ భూమితో పాటు మల్లే మంగమ్మ అనే మహిళకు చెందిన సర్వే నెంబర్ 153లో 0.20 సెంట్లు, 154/1లో ఎ॥ 1.7.5 సెంట్లు భూమిని అదే వెంచర్‌లో కలిపేసుకోవడం జరిగింది. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనంతో అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టారు. ఆక్రమిత ప్రదేశానికి అధికారులు వస్తున్నారని తెలుసుకున్న ఆమె కూడా అక్కడకు చేరుకుంది. తహశీల్దారు చిరంజీవి ఎదుట విధివంచితురాలు మంగమ్మ ఆవేదనతో 'మాకు న్యాయం చేస్తారా... మా చావును చూస్తారా' అంటూ వేడుకోవడం గమనార్హం.

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే

చట్టపరమైన చర్యలు

- యువతను హెచ్చరించిన ఎస్పీ ఏఆర్.దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాడిఫైడ్ సైలెన్సర్లను కలిగి తోటి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. ఒంగోలు నగర పరిధిలో విపరీతమైన ధ్వని పుట్టించే మాడిఫై సైలెన్సర్లు 550 (సుమారు రూ.25 లక్షలు) శుక్రవారం జిల్లా ఎస్పీ ఒంగోలు మంగమూరు రోడ్డు, రత్నదీప్ స్టోర్స్ వద్ద రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు. ఎస్పీ వెంట కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ట్రాఫిక్ ఎస్సైలు కోటయ్య, శ్రీనివాసరావు, శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

దశాబ్దాలుగా 22 ఏలో ఉన్న

102 ఎకరాల భూమికి విముక్తి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

దశాబ్దాలుగా 22 ఏలో ఉన్న 102 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు. నిజాంపట్నం మండలం ముత్తుపల్లి గ్రామంలోని రైతులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమావేశం నిర్వహించారు. సాగులో ఉన్న ఆ భూమి యజమానులకు పూర్తిస్థాయిలో యాజమాన్య హక్కులు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ముత్తుపల్లి గ్రామంలోని 87 మంది రైతులకు చెందిన 102 ఎకరాల భూమికి రైతు వారి పట్టా భూమి కింద పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు. సంబంధిత రెవెన్యూ దస్త్రాలలో నమోదు చేస్తామని, 87 మందికి పూర్తిస్థాయిలో యాజమాన్య హక్కులు కల్పిస్తామని చెప్పారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. సమావేశంలో రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి, నిజాంపట్నం తహసిల్దార్ ఎం శ్రీనివాసరావు, ముత్తుపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శిగా పెద్ద మస్తాన్



పెద్ద మస్తాన్

ప్రజాశక్తి-తర్లుపాడు

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా తర్లుపాడు సర్పంచుల సంఘం అధ్యక్షులు, కేతగుడిపి సర్పంచ్ పెద్ద మస్తాన్‌ను పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దూదేకుల పెద్దమస్తాన్ గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం వైసిపి ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబుని, ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు జంకె వెంకటరెడ్డి, మార్కాపురం సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు కేపీ కొండారెడ్డిని కలిసి.. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి కారుమూరి నాగేశ్వరరావుకి దూదేకుల పెద్ద మస్తాన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ఆదేశానుసారం, నిబంధనలకు కట్టుబడి, నిబద్ధతతో, విశ్వాసంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



చొక్కా చించుకుంటున్న ఖాశిం

విలేకరినంటూ ఖాశిం అనే వ్యక్తి తనపై దాడి చేశారని గిద్దలూరు మండలం ఎన్.బయనపల్లె అంగన్వాడీ కార్యకర్త పి.నాగలక్ష్మి శుక్రవారం గిద్దలూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గిద్దలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఖాసింకు, అంగన్వాడీ ఇన్‌ఛార్జి సిడిపిఒ మధ్య తగాదా జరిగింది. ఆఫీసు పనిమీద వచ్చిన నాగలక్ష్మి దురుసుగా మాట్లాడుతున్న ఖాసీం మాటలకు అడ్డుపడింది. మాటామాటా పెరిగి ఖాసిం అంగన్వాడీ కార్యకర్త పి నాగలక్ష్మి పై చేయి చేసుకున్నారు. కార్యాలయం బయటకు వచ్చి చొక్కా చించుకొని.. 'నాపై దాడి చేస్తారా.. మీరు అంగన్వాడి కేంద్రాలు ఎలా నడుపుతారో చూస్తా..' అంటూ వెళ్లిపోయారని గిద్దలూరు పోలీస్‌స్టేషన్‌లో అంగన్వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఖాసిం చేసిన దాడి గురించి అంగన్వాడీ కార్యకర్తలు సిఐకి వివరించారు.